క్లుప్తంగా

చర్యలు తీసుకోండి

చండ్రుగొండ: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ బాణోత్ పార్వతి అధికారులకు సూచించారు. మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరగగా ఎంపీపీ మాట్లాడుతూ పైప్‌లైన్లు, డైరెక్ట్ పంపింగ్ సిస్టంల మరమ్మతులు ముందస్తుగానే చేపట్టాలన్నారు. అనంతరం వివిధ శాఖాధికారులు నివేదికలు సమర్పించగా, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఎంఈఓ ఎస్.సత్యనారాయణ, ఏఈలు శ్రీనివాసరావు, నర్సింహారావు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

మణుగూరుటౌన్: మండల పరిధిలోని గుట్టమల్లారంలో సోమవారం తనిఖీ చేసిన మణుగూరు పోలీసులు పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌కుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మణుగూరుటౌన్: మండలంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో టాటా ఏస్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్న మండలంలోని సమితి సింగారానికి చెందిన సుగ్గల జనార్దన్ పట్టుబడ్డాడు. అయన నుంచి 10 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ సతీష్ తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి గ్రామపంచాయతీ పరిధి కొత్తూరు గ్రామంలో ఎట్టకేలకు తాగునీటి సమస్యను పరిష్కరించారు. తాగునీటి పథకం తరచూ మరమ్మతులకు గురి కావడంతోపాటు, మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీటి సరఫరా కూడా నిలిచిపోగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రూ.4.50లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇటీవలే బోరు వేయించగా, సోమవారం మోటారును బిగించారు. అనంతరం ఇంటింటికీ తాగునీరు అందించేందుకు పైపులైనుకు కనెక్షన్ ఇవ్వగా, గ్రామంలో ఎట్టకేలకు తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది.

ఎమ్మెల్యేల నివాళి

మణుగూరుటౌన్: మంత్రి ధనసరి సీతక్క వ్యక్తిగత సహాయకుడు, మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్‌లో నివసించే బండారి సతీష్ తండ్రి బండారి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. సోమవారం దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలు హాజరై నివాళులర్పించారు. బూర్గంపహాడ్ మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, మణుగూరు మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు పాలమూరి రాజు, కేవీరావు, గుడిపూడి కోటేశ్వరరావు, పుచ్చకాయల శంకర్, దొబ్బల వెంకటప్పయ్య, గాండ్ల సురేశ్, రవి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వారావుపేట(ములకలపల్లి): జగన్నాథపురానికి చెందిన ఆర్‌ఎంపీ ఇనుకుర్తి రాము కుటుంబాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం పరామర్శించారు. రాము తండ్రి దారి అనారోగ్యంతో బాధపడుతూ, ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. రాము ఇంటికి వెళ్ళిన జారె, దారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గొడుగులు వితరణ

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి పాల్వంచకు చెందిన స్వరూప్ శ్రీదేవీ దంపతులు గొడుగులను వితరణగా సోమవారం అందజేశారు. సుమారు రూ.20వేల విలువ చేసే గొడుగులను ఉత్సవాల ప్రత్యేకాధికారి అనిల్ కుమార్‌కు అందజేశారు. అర్చకులు శేషం కిరణ్‌కుమార్ చార్యులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

అశ్వారావుపేట(ములకలపల్లి): మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శంకర్ ఆధ్వర్యంలో బండారిగూడెం గొత్తికోయ చిన్నారులకు సోమవారం దుస్తులు అందజేశారు. తిమ్మంపేటకు చెందిన జలగం లీలా సంతోశ్ బాల్యమిత్రుడు విష్ణుప్రసాద్ దుస్తులు సమకూర్చారని ఆయన తెలిపారు.

ఇలవేల్పుల జోడాయాత్ర

అశ్వాపురం: మండల ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడు కల్లూరి నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివాసీ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముందు సోమవారం మండలంలో ఇలవేల్పుల జోడా యాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమంలో తోకల చంద్రశేఖర్, నరేష్, తంగెళ్ల భద్రయ్య, బట్టా సత్యనారాయణ, కుంజా రామారావు, నాగేశ్వరరావు, చావ ముత్తయ్య, శ్రీను పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న ఓ హోటల్‌లో టిఫిన్ చేయడానికి వెళ్లిన లక్ష్మణ్ అనే వ్యక్తిపై హోటల్ యజమాని రాడ్డుతో దాడి చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో సోమవారం రాత్రి ప్రచారం జరిగింది. ఈఘటనలో లక్ష్మణ్ తలపై రాడ్డు బలంగా తాకగా తీవ్రంగా రక్తస్రావం అవుతుండడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అయితే, హోటల్ యజమాని, బాధితుడి నడుమ వివాదానికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

వానరసైన్యం బీభత్సం

- ఆహారం కోసం ఇళ్లలోకి దూరుతున్న కోతులు
- వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలపై దాడులు
- గ్రామాల్లో హడలిపోతున్న జనం


కోతుల దాడిలో గాయపడిన బాలుడికి వైద్యం చేస్తున్న సిబ్బంది


కోతుల దాడితో అయిన గాయాలు


కోతులు దాడి చేయడంతో కాలికి అయిన గాయం..

చండ్రుగొండ: వానరసైన్యం గ్రామాల్లో బీభత్సం సృష్టిస్తోంది. గతంలో పదుల సంఖ్యలో ఉన్న కోతులు నేడు వందల సంఖ్యలో పెరిగాయి. నేరుగా ఇళ్లల్లోకి దూరి తినుబండారాలు, పదార్థాలు ఏమున్నా ఎత్తుకుపోతున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇళ్లల్లోని సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయి. ఇంటి పెరెట్లోని పూలు, పండ్ల మొక్కలను, చెట్లను సర్వనాశనం చేస్తున్నాయి.

ఏళ్ల తరబడి కోతుల సమస్య ప్రజలను పట్టిపీడిస్తుంది. కాగా ఇటీవలకాలంగా కోతుల సమస్య మరింత పెరిగింది. కోతుల సమస్యను పరిష్కరించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్న పట్టించుకునే నాథుడే లేడు. మా పరిధిలో లేదని పంచాయతీ అధికారులు చెబుతుండగా.. ప్రభుత్వ శాఖల అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. కోతుల బారిన పడిన క్షతగాత్రుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో క్షతగాత్రుల గణాంకాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కోతులైతే ప్రజలు ఇబ్బందులు పడ్తుంటే పాలకులకు పట్టించుకోకపోవడం ఏమిటి? అనే ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది.

మండల కేంద్రంలో పరిస్థితి జటిలం

మండలకేంద్రం చండ్రుగొండ ఒకవిధంగా మేజర్ పంచాయతీ. సుమారుగా పదివేలకు పైగానే జనాభా ఉంటారు. 2,500 ఆవాసాలు, 10 వేల పైచిలుకు జనాభా ఉంటారు. వ్యాపార వాణిజ్య కూడళ్లు అధికంగ ఉండటం సహజం. ఈ నేపథ్యంలో కోతుల బెడద చండ్రుగొండకు అధికమే. ప్రధాన సెంటర్‌లో కోతులు సృష్టించే బీభత్సం అంత ఇంతా కాదనే చెప్పాలి. పూల, పండ్లు, కిరాణాదుకాణ దారులు ఆదమరిస్తే అంతే కోతులు షాపుల్లో దూరి వాటికి అందినకాడికి తీసుకెళ్తున్నాయి. తినుబండారాలు తీసుకెళ్తే సరే. కాని మనుషులపై దాడి చేసి గాయాలపాల్జేస్తున్నాయి. సమస్య తీవ్రతను పరిశీలించి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోతున్నారు.

బండిపై వెళ్తుంటే కరిచాయి..



ద్విచక్రవాహనంపై వెళ్తుంటే కోతులు వెంబడించాయి. మీద పడి మరీ వీపుభాగంలో కరిచాయి. గ్రామంలో తిరగాలంటేనే భయమేస్తోంది. పంట చేలను నాశనం చేస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జ్యోతి నాగేశ్వరరావు, తిప్పనపల్లి

రోజూ ఒక్క కేసైనా వస్తోంది..



ఈ మధ్య కాలంలో కోతుల బారిన పడిన క్షతగాత్రుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కనీసం రోజుకు ఒక కేసైన వస్తోంది. ఆస్పత్రి ప్రాంగణం తోపాటు రోగుల వద్ద ఉంటే తిను పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి.

– డాక్టర్ తనుజ, వైద్యాధికారిణి, చండ్రుగొండ

కోతులు పట్టించేందుకు చర్యలు



కోతుల బెడద ఎక్కువైందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. అవకాశాలను బట్టి కోతులను పట్టించే ప్రక్రియను పరిశీలిస్తాం. పంచాయతీల వారిగా సమస్య తీవ్రత, నిల్వ నిధులపై గ్రామ కార్యదర్శులతో చర్చిస్తాం.

– బయ్యారపు అశోక్, ఎంపీడీఓ, చండ్రుగొండ

చెరువులో అక్రమ తవ్వకాలు


కొల్లాయికుంట చెరువులో మట్టి తవ్వకంతో ఏర్పడిన పెద్ద గుంతలు

దమ్మపేట: మండలంలోని మందలపల్లి గ్రామ శివారులోని కొల్లాయికుంట చెరువులో అక్రమ మట్టి తవ్వకాలను గుర్తు తెలియని ముఠా ఆదివారం అర్ధరాత్రి యథేచ్ఛగా చేపట్టారు. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని మందలపల్లి గ్రామ శివారులోని కొల్లాయికుంట చెరువులో జేసీబీ యంత్రాలతో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపారు. ఈ మట్టిని లారీ టిప్పర్‌లలో బయటకు తరలించారు. తవ్వకాల్లో వందల ట్రిప్పుల మట్టిని వ్యాపార అవసరాల కోసం బయటకు తరలించినట్లు సమాచారం. దీనిపై ఇరిగేషన్ డీఈ కృష్ణను వివరణ కోరగా.. ఈ అక్రమ తవ్వకాల విషయం తమ దృష్టికి రాలేదని, తమ శాఖ అధికారి ద్వారా తగు విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమన్వయ సమావేశం

దమ్మపేట: ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీలో పనిచేసే వీఓలకు మధ్య సమన్వయ సమావేశం నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమన్వయ సమావేశంలో ప్రధానంగా ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో పాఠశాలల అభివృద్ధి కోసం, ప్రత్యేక అధికారిగా నియమించబడిన ఇరిగేషన్ ఈఈ సురేష్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రథమ అవసరాలైన తాగునీరు, టాయిలెట్ల నిర్మాణం, భవనాల మరమ్మతులు తదితర నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల విషయంలో ప్రత్యేక అధికారి చొరవ తీసుకుని, నాణ్యతలో రాజీలేకుండా చూడాలని అన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు, వీఓలు సమన్వయంతో పనిచేసి, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపుగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఐకేపీ వీఓలు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్‌ను సంస్కరించండి

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌ఫెడ్ సంస్థ అధికారుల నిర్లక్ష్యం, ఉద్యాన అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్వహణ సక్రమంగా లేక సంస్థ నర్సరీలు అధ్వానంగా ఉన్నాయని ఆయిల్ పాం గ్రోవర్స్ సొసైటీ బాధ్యుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి సూర్యనారాయణను కలిసి వినతి చేశారు. అనంతరం సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ.. పామాయిల్ సాగుదారులకు, ఆయిల్‌ఫెడ్ సంస్థ, ప్రభుత్వ ఖజానాకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. నాలుగేళ్ల వరకు అందించాల్సిన ప్రోత్సాహక సబ్సిడీ బకాయిలు విడుదల చేయించాలని విన్నవించారు.

జీవోను వెనక్కి తీసుకోవాలి


సీడీపీఓకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు తక్కువ గ్రాడ్యుటీ చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం అశ్వారావుపేట సీడీపీఓ రోజా రాణికు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. అయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 10 ప్రకారం 65 ఏళ్లు నిండిన టీచర్లకు లక్ష రూపాయాలు, హెల్పర్లకు రూ.50వేలు చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం తగదన్నారు. ఈ జీవోను తక్షణమే వెనక్కి తీసుకోని గత ప్రభుత్వ హామి ప్రకారం టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.1లక్ష చొప్పున ఉద్యోగ విరమణ బెనిఫిట్స్‌ను పెంచాలన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి ఉన్నారు.

దమ్మపేట: అంగన్‌వాడీలకు పెన్షన్‌తో పాటుగా గ్రాట్యుటీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని కోరుతూ, ఐసీడీఎస్ సీడీపీఓకు వినతిపత్రాన్ని అంగన్‌వాడీ టీచర్లు అందజేశారు. సోమవారం దమ్మపేటలో అంగన్‌వాడీలు మాట్లాడారు. రాజ్యలక్ష్మి, జ్యోతి, సుజాత, జయ, లక్ష్మి పాల్గొన్నారు.

అశ్వాపురం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ కార్యాలయం సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నాయకులు శ్రీలత, రమాదేవి, విజయలక్ష్మి, కరుణ, రమణ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా సర్వైలెన్స్ కార్యక్రమం

మణుగూరురూరల్: మండల పరిధిలోని పెద్దిపల్లి గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మలేరియా సర్వైలెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటిని సందర్శించి జ్వరాలపై సర్వే చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చి జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేయడంతో పాటు రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్‌యుఓ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ఎండాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటిని ఎక్కువగా త్రాగాలని సూచించారు. అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, శైలజ, రోజా తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని ప్రగళ్లపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన బాధిత జుంజూరి నర్సింహారావు కుటుంబాన్ని యండి.హాలీంఖాన్ సోమవారం పరామర్శించి రూ.5వేలు నగదు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరి సీతారామరావు, కెల్లా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలరాముడి చిత్రపటాల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ, పట్టాభిషేకం ఫొటోలను సోమవారం పంపిణీ చేశారు. సోమవారం అశ్వారావుపేట మండల కేంద్రంలోని ప్రతీ దుకాణానికి స్థానిక వాసవిక్లబ్ డిస్ట్రిక్ జాయింట్ సెక్రటరీ శీమకుర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ పంపిణీని స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా ప్రారంభించగా, అనంతరం దుకాణాలదారులకు అందించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శీమకుర్తి వెంకటేశ్వరరావు, కుంచం వెంకటేశ్వరరావు, పూర్ణ, పద్దం చంద్రరావు, వంటిపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

భద్రాచలం(భద్రాచలంటౌన్): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రిజర్వేషన్లు వంద శాతం అమలు చేయడంతో పాటు భద్రాచలం కేంద్రంగా గిరిజన న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 20న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే గిరిజన గర్జన సభను విజయవంతం చేయాలని జీఎస్పీ కన్వీనర్ సొందె వీరయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ కోరారు. పట్టణంలోని సుదరయ్య నగర్ కాలనీలో సోమవారం జరిగిన గిరిజన సంఘాల ఐక్య వేదిక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కొమరం బుచ్చయ్య, ఇర్ప ప్రకాష్ దొర, కేశవ నాయక్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

గెలిపిస్తే సమగ్ర అభివృద్ధికి కృషి

బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు


దమ్మపేట: గడప గడపకూ ప్రచారం చేస్తున్న అభ్యర్థి వినోద్‌రావు, నాయకులు

దమ్మపేట/చండ్రుగొండ/అశ్వారావుపేటరూరల్/అన్నపురెడ్డిపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి తనను గెలిపిస్తే ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు వెల్లడించారు. సోమవారం ఆయన దమ్మపేట, చండ్రుగొండ, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రోడ్‌షోల ద్వారా తనను గెలిపించాలని కోరడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. యావత్ ప్రపంచం భారత్ వైపు చూడడానికి ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత, ముందుచూపే కారణమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ 400 సీట్లతో బీజేపీ మరోమారు కేంద్రంలో అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం నుంచి తనను గెలిపిస్తే అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రసిద్ధి గాంచిన అశ్వారావుపేట నియోజకవర్గంలో పామాయిల్ బోర్డు ఏర్పాటును ఎవరూ పట్టించుకోలేదని, తనను గెలిపిస్తే బోర్డు మంజూరు చేయించడంతో పాటు భద్రాచల రామాలయం అభివృద్ధి, కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు, కొవ్వూరు రైల్వే లైన్‌ను భద్రాచలం వరకు పొడిగించేలా కృషి చేస్తానని తెలిపారు. కాగా, దమ్మపేటలో బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా నాయకుల మధ్య ఐక్యతలేమిని గమనించిన వినోద్‌రావు అందరూ వచ్చాకే ప్రారంభించారు. ఈ ప్రచారంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్‌తో పాటు నాయకులు గొట్టిపాళ్ల శ్రీనివాసరావు, దారా నాగేశ్వరరావు, మడకం రవి, వనుమర్తి పుల్లారావు, మునలయ్య, వాసం పోలయ్య, బాలాజీ, బండారు చంద్రశేఖర్, ఎస్‌వీటీ.కొండ, జల్లిపల్లి అరవింద్, కలకోటి కృష్ణ, చిట్టి శ్రవణ్, బుడిపిటి శ్రీను, మద్దాల దేవి, దేవి బాలకిరణ్‌శర్మ, భోగి కృష్ణ, నల్లమోతు రఘుపతిరావు, రవిందర్‌రెడ్డి, జంగా సత్యనారాయణరెడ్డి, రాజేష్‌నాయక్, రాంపండు పాల్గొన్నారు.

దేశ రక్షణకు బీజేపీని ఓడించండి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

మణుగూరురూరల్: దేశాన్ని రక్షించేందుకు జరగబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి రక్షణ లేకుండా పోతుందని ఆరోపించారు. పదేళ్ల పాలనలో బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను దారాదత్తం చేస్తూ.. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. మనుధర్మ శాస్త్రంతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తూ.. రాచరిక పాలన కొనసాగిస్తోందని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజలందరూ ఎన్నికల్లో బీజేపీని ఓడించి లౌకికశక్తులను గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, నాయకులు దామల్ల లెనిన్‌బాబు, యు నరసింహారావు, ములకల ఉత్తమ్, బి.రాజు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య శిబిరం

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే తిరు కల్యాణ మహోత్సవాలకు వచ్చే భక్తులను భద్రాద్రి చేరవేసే ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ సీనియర్ వైద్యాధికారి ఏవీ గిరిసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాచలంలో శ్రీరామనవమి, పట్టాభిషేకం ఉత్సవాలు నిర్వహించే రెండు రోజుల పాటు వైద్యసేవలు కొనసాగుతాయని, రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్టిలో ఉంచుకొని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచిన్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యోగులతో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ ఉద్యోగులు సైతం వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు.

కంటి వైద్య శిబిరం ఏర్పాటు..

గుండాల: మండల కేంద్రంలో సోమవారం వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్స్, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా కంటి వైద్య శిబిరాన్ని వాసవీక్లబ్ ఇంటర్నేషన్ గవర్నర్ గుమ్మడివెల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు ఉపయోగపడే ఈ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరానికి 400 మంది చుట్టుపక్క గ్రామాలను వచ్చారని, వారందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్స్ అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు అన్నారు. ఇందులో 150 మందిని ఆపరేషన్ నిమిత్తం ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి రిఫర్ చేశామన్నారు. ఆర్‌ఎంపీ వైద్యులు మహమూద్ రూ.20 వేలు విలువచేసే హైడ్రాప్స్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి మనేష్ రెడ్డి, క్లబ్ కోశాధికారులు పుల్లఖండం ఉపేందర్, అనుమోలు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకులు గౌరిశెట్టి శ్రీనివాస్, మానాల నారాయణ మూర్తి, నర్సింహరావు, ఖాదర్‌బాబు, రాజేశ్వరావు, వివి సుబ్బారావు, చిన్న సత్యనారాయణ, వాసు, సాయిబాబా, టి. నాగరాజు, పల్లెర్ల చంద్రశేఖర్, మానాల ప్రభాకర్, టి.రాము, ప్రభాకర్, శ్రావన్, శ్రీశైలం, శరత్, వీరన్న, నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో ధ్వజారోహణం


ధ్వజారోహణ కార్యక్రమం చేపడుతున్న అర్చకులు

దుమ్ముగూడెం: పర్ణశాలలో జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఆలయ అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం దగ్గర విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం,అగ్ని మధనం,అగ్ని ప్రతిష్ట , మూర్తికుంభ ఆవాహన ధ్వజారోహణం గరుడ ప్రసాద వితరణ మహా నివేదన తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చేతు స్థానార్చన బేరిపూజ, దేవతవానం అష్టదిక్ పాలక బలి ప్రధానం నివేదన తీర్థ ప్రసాద గోష్టి చేపట్టి తిరువీధి సేవ తదనంతరం తీర్థ ప్రసాదాలను నివేదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక అధికారి అనిల్ కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు శేషం, కిరణ్ కుమార్ ఆచార్యులు, పొడిచేటి రామభద్ర ఆచార్యులు, సీతారామ అనుజాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజ ఆచార్, ఎం.నరసింహ చార్యులు, ఆలయ సిబ్బంది రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ శిఖర ప్రతిష్ఠ

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటలోని గాయత్రి ఆశ్రమంలో అరుణాచలేశ్వరుని ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకుడు మూర్తిజీ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. శిఖర ప్రతిష్ఠాపన సందర్భంగా హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, కక్కిరాల రమేష్, కెవి. సత్యనారాయణ, పగడాల రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, చిన్నశెట్టి చిట్టిబాబు, పసుమర్తి చినబాబు పాల్గొన్నారు.

'నవమి' పనుల్లో భద్రతాలోపం


బ్రిడ్జి సైడ్‌వాల్‌పై నిల్చున్న వ్యక్తి

భద్రాచలం(భద్రాచలంఅర్బన్): భద్రాచలంలో ఈ నెల 17, 18న జరుగనున్న శ్రీరామనవమి, పట్టాభిషేకానికి సంబంధించి వివిధ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా భద్రాచలం గోదావరి వంతెనపై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్న పనుల్లో భద్రతా ప్రమాణాలు లోపించాయి. పనుల్లో భద్రతా పరమైనా చర్యలు తీసుకోకుండా బ్రిడ్జి సైడ్ వాల్‌పై నిడుచుకుంటూ విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నారు. ఆ సమయంలో ఒక్క అడుగు అటు ఇటు అయితే సదరు వ్యక్తి గోదావరి నదిలో పడి ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి లేకపోలేదు. కాబట్టి ఇప్పటికైనా అధికారులు స్పందించి వేడుకలను సంబంధించిన పనులను టెండర్ ప్రక్రియలో దక్కించుకునే గుత్తేదారుడికి పలు సూచనలు చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుకుంటున్నారు.